


రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## సేవ చేయడం అదృష్టంగా భావించాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించా లని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి 11 నెలల శిక్షణ కాలాన్ని పూర్తి చేసుకొని వెళ్తున్న సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లా డుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిజాయితీగా పనిచేయడం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. హర్ష్ చౌదరి ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా 11 నెలల పాటు వివిధ శాఖల్లో ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కలెక్టర్ అన్నారు. మారుమూల మండలం దౌల్తాబాద్ తహసిల్దారుగా విధులు నిర్వహించే క్రమంలో

మిగతా 2లో



ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరిని సన్మానిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

## స్కూల్ ప్రాంగణంలో క్షుద్ర పూజలు?

### ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక పనులు
### భద్రత లేమిపై స్థానికుల ఆందోళన

**కొత్తూరు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** కొత్తూరు మండల పరిధిలోని సిద్ధాపూర్ జెడ్పి హెచ్‌ఎస్‌లో ఇటీవల గుర్తించిన అనుమానాస్పద ఘటన పాఠశాల భద్రతపై మరింత అప్రమత్తత అవసరాన్ని గుర్తు చేసింది. శనివారం గ్రౌండ్‌లో కొన్ని అసాధారణ దృశ్యాలను స్థానికులు గుర్తించారు. క్షుద్ర పూజలు చేసిన అనవాళ్లు కనిపించటంతో తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వామి మాట్లా డుతూ, ఇది కొందరు ఆకతాయిల చేష్టగా భావిస్తున్నామని తెలిపారు. పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడం వల్ల బయటి వ్యక్తులు సులభంగా లోపలికి ప్రవేశించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. పాఠశాల ప్రాంగణంలో మద్యం సేవించడం, ఖాళీ బాటిళ్లను వదిలివెళ్లడం వంటి సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని వెల్లడించారు. చెట్లకు ఏర్పాటు చేసిన

మిగతా 2లో



ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్న అనంతరం బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ఛైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి

## ఇబ్రహీంపట్నం పీఠంపై
# గులాబీ జెండా!

### మున్సిపల్ ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

**కాంగ్రెస్ ఎత్తులను చిత్తు చేసిన ప్రశాంత్ రెడ్డి వ్యూహం**

**మిత్రధర్మంతో బిజెపికి దక్కిన వైస్ ఛైర్మన్ పదవి**

**800 మంది పోలీసులతో బందోబస్తు**

**144 సెక్షన్ మధ్య ముగిసిన హైడ్రామా**

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** ఇబ్రహీం పట్నం మున్సిపల్ పీఠం దక్కించు కునేందుకు సాగిన రాజకీయ యుద్ధంలో చివరకు బిఆర్‌ఎస్ తన పట్టును నిరూపించుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ వేసిన ఎత్తుగడలను చిత్తు చేస్తూ, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తనయుడు, బిఆర్‌ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి (బంటి) నడిపిన రాజకీయ మంత్రాంగం ఫలించింది. శనివారం భారీ పోలీసు బందోబస్తు, ఆంక్షల మధ్య నిర్వహించిన ఎన్నికలో మున్సిపల్ ఛైర్మన్‌గా బిఆర్‌ఎస్‌కు చెందిన టేకుల సుదర్శన్ రెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్‌గా బిజెపికి చెందిన ముత్యాల శ్యామల ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మిత్రధర్మాన్ని పాటిస్తూ బిఆర్‌ఎస్ తన మద్దతును బిజెపికి ప్రకటించడం విశేషం.

**ఉదయం నుంచీ ఉత్కంఠ**

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఉదయం నుండే ఉత్కంఠగా సాగింది. సుమారు 800 మంది పోలీ సులతో పట్టణమంతా కట్టుదిట్టమైన భద్ర తను ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమ లులో ఉన్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో నెలకొన్న వేడి తగ్గలేదు. గత కొద్దిరోజులుగా క్యాంపుల్లో ఉన్న కౌన్సిలర్లను ప్రత్యేక బస్సులో నేరుగా మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత, కాంగ్రెస్ పార్టీకి సరైన బలం లేకపోవడంతో బిఆర్‌ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డి పేరును మెజారిటీ కౌన్సి లర్లు ప్రతిపాదించగా, ఆయన ఎన్నిక ఏకగ్రీ వమైంది. అలాగే వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో బిఆర్‌ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరించి బిజెపి అభ్యర్థికి మద్దతు తెలపడంతో ముత్యాల శ్యామల విజ యం సాధించారు.

**ప్రజాస్వామ్యం గెలిచింది : సబితా ఇంద్రారెడ్డి**

రాష్ట్ర ప్రజలు ఇంకా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా స్వామ్యం గెలిచిందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డిలతో కలిసి ఆమె విలేక రులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో తమకు పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ, అధికార కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. కోర్టు జోక్యంతో నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించిందని, అధికార బలాన్ని ప్రజలు లెక్కచేయలేదని ఆమె ధ్వజమెత్తారు. గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు చేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు

మిగతా 2లో

# మామిడికి అకాల గండం!



### వాతావరణ ఆకస్మిక మార్పులతో రైతుల గుండెల్లో రైళ్లు

**ఏటా ఏప్రిల్, మే నెలల్లో వణికిపోతున్న రైతులు - ఆకస్మిక గాలివానలతో రాలిపోతున్న కాయలు - ఏడు టన్నులకే పరిమితమవుతన్న దిగుబడి - రూ. 50 వేలు పెట్టుబడికి చేతికొచ్చేది సగమే!**

**రంగారెడ్డి జిల్లాలో 26 వేల ఎకరాల్లో సాగు - షాద్‌నగర్‌లోనే 10 వేల ఎకరాలు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో మామిడి సాగు జూదంగా మారింది. అష్టకష్టాలు పడి పంట పండించిన రైతుకు, దిగుబడి చేతికి వచ్చే ఏప్రిల్, మే నెలల్లో వాతావరణం చుక్కలు చూపిస్తోంది. అకస్మాత్తుగా వచ్చే గాలివానలు, వడగళ్ల వానలు మామిడి రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. అంతా సవ్యంగా ఉంటే ఎకరానికి 10 నుంచి 14 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా, గత రెండేళ్లుగా వాతావరణ మార్పుల వల్ల అది కేవలం 7 టన్నులకే పరిమితమవుతోంది.

**పెరుగుతున్న సాగు..**

జిల్లాలోని ఎర్ర నేలలు పండ్ల తోటలకు అనువుగా ఉండటంతో ఏటా మామిడి సాగు పెరుగుతూనే ఉంది. జిల్లా వ్యాప్తంగా 26 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో 10 వేల ఎకరాలు, ఇబ్రాహింపట్నం, మహేశ్వరం పరిధిలో 7 వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది. చేవేళ్ల, రాజేంద్రనగర్, ఆమన్‌గల్ డివిజన్లలోనూ తోటలు విస్తరించి ఉన్నాయి. ఎకరానికి దాదాపు రూ. 45 వేల నుండి రూ. 50 వేల వరకు పెట్టుబడి పెడు తున్నారు. కానీ కోత సమయంలో వచ్చే ఈదురు గాలుల వల్ల కాయలు నేలరాలి రైతులు భారీగా నష్టపోతున్నారు.

**వ్యాపారుల ముందస్తు ఒప్పందాలు**

మామిడి కాయలు పిందె దశలో ఉన్నప్పుడే స్థానిక పండ్ల వ్యాపారులు తోటలను పరిశీలించి, కాతను బట్టి ఎకరాకు రూ. 20 వేల నుండి రూ. 50 వేల వరకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. పూత, కాత ఆశాజనకంగా ఉంటేనే రైతుకు గిట్టుబాటు ధర దక్కుతోంది.

**రాయితీలు సకాలంలో అందితేనే ఊరట**

గతంలో ఎకరానికి 60 మొక్కలు నాటగా, ప్రస్తుతం రైతులు 80 నుండి 100 మొక్కల వరకు నాటు తున్నారు. దీనివల్ల సస్యరక్షణ చర్యలు చేపట్టడం కష్టమవుతోందని, 60 నుండి 70 మొక్కలే శ్రేష్టమని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. హెక్టారుకు రూ. 22,500 సబ్సిడీ అందిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి సురేష్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం,

మిగతా 2లో

# ఫీజులుంపై తల్లిదండ్రుల ఆగ్రహం



పాఠశాల ముందు ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు

### సుజాత ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద ఉద్రిక్తత

**మొయినాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** మొయినా బాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుజాత ఇంటర్నే షనల్ స్కూల్ యాజమాన్యం తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో శనివారం మండలంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**ఏటా 25 శాతం పెంచుతున్నారు**

పాఠశాలలో ప్రతి ఏటా సుమారు 25 శాతం మేర ఫీజులు పెంచుతూ విద్యార్థులపై భారీగా ఆర్థిక భారం మోపుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. చదు వుకు సంబంధం లేని వివిధ ఖర్చుల పేరుతో ఒక్కో విద్యార్థి నుండి సంవత్సరానికి సుమారు నాలుగు వేల రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వారు విమర్శించారు.

**జాతీయ రహదారిపై ధర్నా**

పాఠశాలలో విద్యా ప్రమాణాలు తగ్గిపోతున్నప్పటికీ, ఫీజులు మాత్రం విపరీతంగా పెంచడం అన్యాయమని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన తల్లిదండ్రులు హైదరాబాద్ –బీజాపూర్ రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గత ఏడాది సమ్మర్ క్యాంప్ నిర్వహణలో జరిగిన అశ్రద్ధ వల్ల ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఈ సందర్భంగా తల్లిదండ్రులు గుర్తు చేశారు.

ఆ ఘటనపై ఇంతవరకు సరైన చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని, అక్రమ వసూళ్లను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



కొడంగల్‌లో మురుగుకాల్వల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్

## అభివృద్ధి పనులపై కలెక్టర్ నజర్

**క్షేత్రస్థాయిలో నిర్మాణాల తనిఖీ**

**మే నెలాఖరుకల్లా దుద్యాల మండల భవనం పూర్తి కావాలని ఆదేశం**

**పనుల పురోగతిపైనా సమీక్ష**

2

## భూ కబ్జాకు రాజకీయ వ్యూహం!

### తప్పుడు పత్రాలతో పట్టా మార్చేందుకు యత్నం

**మధ్యవర్తుల చేతుల్లోనే రెవెన్యూ రికార్డులా?**

**అధికార పార్టీ నాయకుడి ఒత్తిడిపై బాధితుల నిలదీత**

**పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన**

**పెద్దేముల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలంలో భూ దందా ముదిరిపోతోంది. రాజకీయ బలాన్ని అడ్డుపెట్టుకొని అమా యక రైతుల పట్టా భూములను కాజేసేందుకు కొందరు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తప్పుడు పంచనామా రిపోర్టులను సృష్టించి, రికార్డుల నుంచి అసలైన పట్టాదారుల పేర్లను తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తీవ్ర గందరగోళానికి దారితీసింది. వివరాలలోకి వెళితే.. పెద్దేముల్ మండల పరిధిలోని తట్టెపల్లి గ్రామ శివారులో బొపునారం గ్రామానికి చెందిన నత్తల విమలమ్మ పేరిట 4.09 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమి సోలార్ ప్లాంటుకు ఆనుకొని ఉండటంతో దీనికి భారీగా డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో సదరు భూమిని విక్రయించాలని కొందరు నాయకులు విమలమ్మ కుటుంబ సభ్యులపై గత కొంతకాలంగా ఒత్తిడి తెస్తున్నారు. అయితే, భూమిని


మిగతా 2లో

## చివరి మజిలీకి తప్పని కష్టాలు

### వెలవెలబోతున్న వైకుంఠధామాలు



నందిగామలో వైకుంఠధామం



నిరుపయోగంగా మారిన మంచినీటి సంపు

**నందిగామ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** నందిగామ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో మృతుల దహన సంస్కారాలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సుమారు రూ. 13 లక్షల వ్యయంతో వైకుంఠధామాలను నిర్మించింది. అయితే అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిరక్ష్యం కారణంగా ఇవి నేడు దిష్టి బొమ్మలుగా మారాయి. మండల కేంద్రంలోని వైకుంఠధామంలో చిల్లర దొంగల ఆగడాలు పెరిగిపోయి ఫెన్సింగ్ వైర్లు, బోరు మోటార్ వైర్లు, పైపులు మాయం చేస్తున్నారు. ఇక్కడ దహన సంస్కారాల కోసం నిర్మించిన సిమెంట్ సంపు పగిలిపోవడంతో, పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళలు, పురుషులు దుస్తులు మార్చుకోవడానికి కట్టిన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ లైట్లు వెలగకపోవడంతో, రాత్రి వేళల్లో సెల్ ఫోన్ టార్చ్ లైట్లు, వాహనాల వెలుతురులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఇతర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈదులపల్లిలో వైకుంఠధామం భూ తగాదాల వల్ల కోర్టుకెక్కి నిరుపయోగంగా మారగా, మొత్కులగూడ శివారులో నిర్మించిన కేంద్రం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. చేగూరులో వైకుంఠధామం ఊరికి కిలోమీటర్ దూరంలో ఉండటంతో ప్రజలు దానిని ఉపయోగించడం లేదు. బండకుంట తండాలో అసలు స్మశాన వాటికే లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన సౌకర్యాలు లేని కారణంతో చాలా చోట్ల ప్రజలు తమ పంట పొలాల్లోనే అంత్యక్రియలు జరుపుకుంటున్నారు. నందిగామ, చేగూరు వంటి గ్రామాల్లో వైకుంఠధామాలు ఊరికి దూరంగా ఉన్నందున, అంతిమ యాత్ర కోసం స్వర్గపురి వాహనాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సమస్యలపై పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి స్పందిస్తూ, వైకుంఠధామాల్లోని సమస్యలను పరిష్కరించే యోచనలో ఉన్నామని, దాతలు ముందుకు వచ్చి వాహనాన్ని సమకూరిస్తే బాగుంటుందని తెలిపారు.




చతుర్థ వర్ధంతి

అంచనాలకందని వ్యక్తిత్వం మీది...
పదాలకందని అనుబంధం మనది...
నింగిలోని చుక్కవు నీవైనా, నేలమీద
ప్రతి గుండె గుడిలోనూ మీ రూపాన్ని
దర్శిస్తున్నాము. మీ ప్రేమలోని
మాధుర్యాన్ని, మీ ఆలోచనలోని
ఆదర్శాన్ని అనుక్షణం స్మరిస్తూ, మీరు
మా నుండి దూరమై నాలుగు సంవత్సరాలు
గడిచిననూ మీ మధురస్మృతులు
మరువలేకుండా ఉన్నాము...

బాధాతప్త హృదయాలతో...

కీ॥శే॥ దన్నాడ వెంకటేష్ యాదవ్ గారు
యాదవ సంఘం మాజీ వైస్ ప్రెసిడెంట్ - శంషాబాద్
జననం: 25-06-1972, మరణం: 05-04-2022

అమ్మ - నాన్న
దన్నాడ సాయిలమ్మ - కీ॥శే॥ కొమురయ్య యాదవ్
మాజీ వార్డు మెంబర్ - శంషాబాద్

భార్య: దన్నాడ పద్మ, కీర్తన

కూతుళ్ళు - అల్లుళ్ళు
కొయ్యడ చందన - రాము, డి. వాసవి

కుమారడు: డి. లలితేశ్ యాదవ్

తమ్ముడు - మరదలు
డి. ఆంజనేయ యాదవ్ - హరిత

కుమారులు
డి. శివసాయి - వినితశ్రీ
డి. ప్రవీణ్, డి. ఆర్యన్, డి. ఆదిత్య

కూతుళ్ళు
ఎం. దీక్షిత - శ్రీకాంత్, డి. వర్ష

మనుమరాలు: జ్ఞానవిశిక

అక్కలు - బావలు
ఎం. నీలమ్మ - నర్సింహా యాదవ్
వి. అనసూజ - కొమురయ్య యాదవ్

చెల్లెలు-బావ
కీ॥శే॥ ఇందిర - నర్సింహ్మా యాదవ్

బావమరుదులు
బూరమోని నర్సింహా యాదవ్ - అనిత
మాజీ॥ఉపసర్పంచ్ - మనసాన్‌పల్లి
శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వైస్ చైర్మన్
బి.పి. 4వ వార్డు సభ్యులు - అనితమ్మ
బూరమోని శంకర్ యాదవ్ - పావని


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి నాయకులు

## కవిత పార్టీ ఆవిర్భావ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**మేడ్చల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** కల్వకుంట్ల కవిత ఈ నెల 25న ఏర్పాటు చేయబోయే నూతన పార్టీ ఆవిష్కరణ సభకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను జాగృతి నాయకులు శనివారం మేడ్చల్ పట్టణంలోని ముకుంద ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ కార్యక్రమానికి జిల్లా ప్రజలు అత్యధికంగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి, జాగృతి నాయకులు గుర్రం వెంకన్న, ఎత్తరి గణేష్, కందాడి గౌతమ్ రెడ్డి, మంచాల వంశీ చారి, గిరిశెట్టి రాజు,వరికుప్పల సంతోష తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిటి ఆస్పత్రిలో ఆధునాతన ఐసీయూ

**మేడ్చల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** ప్రాణపాయ పరిస్థితిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి మెడిసిటి ఆస్పత్రిని అత్యాదునిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని ఆస్పత్రి సీఈఓ ఐనిష్ మర్చంట్ అన్నారు. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఘన్‌పూర్‌లో గల మెడిసిటి ఆస్పత్రిలో ఆదునాతన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) ను సీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో వచ్చే రోగుల ప్రాణాలు కాపాడడానికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు ఐసీయూలో ఏర్పాటు చేశామని వివరించారు. 20 పడకల ఐసీయూలో ఆధునిక వైద్య పరికరాలతో పాటూ వెంటిలేటర్లు, డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేశామని, ఈ యూనిట్ నిపుణులైన వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణలో నడుస్తుందని వెల్లడించారు. అనంతరం షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రసిడెంట్ ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, మాట్లాడుతూ మెడిసిటి ఆస్పత్రిలో రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటు ధరలలో అందించే లక్ష్యంలో భాగంగా ఈ ఆధునిక ఐసీయూను ఆస్పత్రిలో అందుబాటులోనికి తెచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఆస్పత్రి మెడికల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ సి గీత, మెడిసిటి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవేంద్ర సింగ్ నేగి, వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఐసీయూ విభాగాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ ఐనిష్

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తాం

**మేడ్చల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** గుండ్ల పోచంపల్లిలో గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించే విధంగా కృషి చేస్తా మని అన్నారు. గుండ్ల పోచం పల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడి గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగిరేస్తామని పేర్కొన్నారు. అనంతరం గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి ఎంపిక కోసం పేర్లు సేకరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు సురేందర్ ముదిరాజ్, ఈశ్వర్, జిల్లా కాంగ్రెస్ ఓబిసి సెల్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మేడ్చల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, లక్షీ ్మనారాయణ స్వామి ఆలయ చైర్మన్ గడిల కృష్ణారెడ్డి, గుండ్ల పోచంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆదిలక్షి ్మ, నాయకులు కావేరి శేఖర్, సురేష్ రెడ్డి, మురళి గౌడ్, దొడ్ల మోహన్ ముదిరాజ్, సురేష్, బిక్షపతి ముదిరాజ్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు

## హామీలన్నీ దశలవారీగా అమలు చేస్తున్నాం

**మొయినాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** అభివృద్ధిని కాంక్షి స్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నామని శ్రీరామ్ నగర్ సర్పంచ్ ఏర్పుల గీతమైపాల్ వెల్లడించారు. శనివారం మొయినాబాద్ మండల పరిధిలోని శ్రీరామ్ నగర్ గ్రామంలో హెచ్‌ఎండీఏ నిధులతో ఏర్పాటు చేసిన వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి పనులకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా గ్రామంలో తడిపొడి చెత్త వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రత, పాఠశాలల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అనేక కార్యక్రమాలను ఇప్పటికే చేపట్టినట్లు వివరించారు. ప్రజల నుండి సమస్యలను తెలుసుకొని అభివృద్ధి పనులు చేపడతామని, గ్రామస్తులందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుమలత మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్ గౌడ్, వార్డు సభ్యులు అమరేందర్ రెడ్డి, రమేష్, రాజు, ప్రభాకర్, పాల్గొన్నారు.


ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బిచ్చప్ప

## సమాజ సేవకు సహకరించాలి

**పెద్దేముల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** అన్ని దానాలలో అన్నదానం మహదానమని వెంకటేశ్వరస్వామి ఆలయ పౌండర్ బిచ్చప్ప అన్నారు. శనివారం ఖాంజాపూర్ గుట్ట సమీపంలోని ఆలయ సన్నిధిలో సుజాత ప్రవీణ్‌కుమార్ దంపతులు అన్నదాన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పౌండర్ బిచ్చప్ప మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తాను సంపాదించిన దానిలో కొంతనైన సమాజసేవకు ఉపయోగించాలని అన్నారు. ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని అన్నారు. మనసు ప్రశాంతంగా ఉండెందుకు దేవాలయాలను సందర్శిం చాలని అన్నారు. స్వామివారి సన్నిదిలో అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## ఎల్‌పిజి గ్యాస్ దొరకడం లేదని టవర్ ఎక్కిన ఆటో డ్రైవర్

**వనస్థలిపురం. ఏప్రిల్.4. ప్రభాతవార్త :** తాను ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నానని,గత కొన్ని రోజులుగా ఎల్.పి. జి. ఆటో గ్యాస్ దొరకడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ శనివా రం జానీ బాబు అనే ఆటో డ్రైవర్ చింతలకుంట లోని రేడియో టవర్ ఎక్కి హల్చల్ చేసాడు.కడప జిల్లా, తుమ్మ లపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జానీబాబు గత కొంతకాలంగా నగరానికి వచ్చి ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు.కాగా గత కొన్ని రోజులుగా ఆటో గ్యాస్ దొరకడం లేదని ,తన ఆటో ను చింతలకుంట సమీపం లో గల రేడియో టవర్ కింద పెట్టి,రేడియో టవర్ ఎక్కాడు. అనంతరం 100 కు డయల్ చేసి తాను రేడియో టవర్ పైకి ఎక్కా నాని సమాచారం ఇచ్చాడు. సమా చారాన్ని అందుకున్న వనస్థలి పురం పోలీసులు, హైడ్రా సిబ్బంది,ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలా నికి చేరుకున్నారు. ఆటో డ్రైవర్ ను కిందకు దిగాలని చెప్పినప్పటికీ, ఆటో డ్రైవర్ జానీ కిందకు దిగలే దు.గ్యాస్ గురించి సి.ఎం. రేవంత్ రెడ్డితో మాట్లాడాలని ,సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# పైరవీలు చేసినోళ్లకే పథకాలు వచ్చాయ్

### బిఆర్ఎస్ హయాంలో పేదలకు అగచాట్లు
### నేడు అర్హులందరికీ పారదర్శకంగా ఇస్తున్నాం
### ఎమ్మెల్యే నారాయణరెడ్డి ధ్వజం

**ఆమనగల్లు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో పైరవీలు చేసిన వాళ్లకే ప్రభుత్వ పథకాలు అందాయని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి దుయ్యబట్టారు. అయితే నేడు సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో మొదటి విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో 3,500 వరకూ 80శాతం నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన పాతకోట మణెమ్మసాయిలు దంపతులు శనివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జనరంజక ప్రజాపాలన కార్యక్రమానికి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే విపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తూ గగ్గోలు పెడుతున్నాయని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారుపై ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు విశ్వసించబోరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్, మార్కెట్ కమిటి చైర్మన్ యాటగీత నర్సింహ్మా, కమిషనర్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, కృష్ణానాయక్, ఏఎంసి డైరెక్టర్ వస్పుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి

## ఇబ్రహీంపట్నం పీఠంపై గులాబీ జెండా

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమని మండిపడ్డారు.

**బిఆర్ఎస్ పునాదులు కదపలేరు : మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ పునాదులు కదిలించే దమ్ము కాంగ్రెస్‌కు లేదని జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. గత 50 రోజులుగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను అడ్డుకుంటూ తమ కౌన్సిలర్లపై అక్రమంగా కిడ్నాప్ కేసులు పెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని 24 స్థానాల్లో 13 చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించగా, అదనంగా బీజేపీ, ఒక స్వతంత్ర అభ్యర్థి మద్దతు ప్రకటించారని తెలిపారు. తమకు స్పష్టమైన మెజార్టీ ఉన్నా, అక్రమ కేసులు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించారని.. ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా ధర్మమే గెలిచిందని ఆయన పేర్కొన్నారు.

**అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోం: – మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి**

మున్సిపల్ అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే ఏమైనా తన ఇంట్లో నుంచి డబ్బులు తెస్తున్నాడా? ప్రజలు కట్టిన పన్నుల రూపంలో వచ్చే ప్రతి పైసా ఇబ్రహీంపట్నం అభివృద్ధికి ఖర్చు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు, అధికారులను ప్రలోభాలకు గురిచేసి ఎమ్మెల్యే వికృత చేష్టలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఎమ్మెల్యే మద్దతు లేకుండా అభివృద్ధి ఎలా చేస్తారో చూస్తాననడం హాస్యాస్పదమని, ప్రభుత్వ ఖజానా ప్రజల సొత్తని ఆయన గుర్తు చేశారు. ఈ విజయం కాంగ్రెస్ ఎమ్మెల్యేకు చెంపపెట్టు లాంటిదని ప్రశాంత్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.

## కౌన్సిలర్ యాదగిరిపై అనర్హత వేటు వేయాలి

### - కలెక్టర్‌కు బిఆర్ఎస్ ఫిర్యాదు

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పార్టీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించి, క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిపై వెంటనే అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ నేత సత్తు వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కలిసి ఆయన ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో పార్టీ నిర్ణయించిన అభ్యర్థికే ఓటు వేయాలని స్పష్టమైన విప్ జారీ చేసినప్పటికీ ఆకుల యాదగిరి పార్టీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ విప్‌కు విరుద్ధంగా వ్యవహరించారని మండిపడ్డారు. పార్టీ క్రమశిక్షణను తుంగలో తొక్కిన ఆకుల యాదగిరి కౌన్సిలర్ పదవిని మున్సిపల్ చట్టం ప్రకారం వెంటనే రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడటం అప్రజాస్వామికమని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మంద సురేష్, మాజీ ఎంపిటిసి ఏనుగు భరత్ రెడ్డి, దొండ వినోద్ రెడ్డి తదితరులున్నారు.


కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ నేత వెంకట రమణారెడ్డి


అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

## అభివృద్ధి పనులపై కలెక్టర్ నజర్

**కొడంగల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయికి వెళ్లి పనులను స్వయంగా పరిశీలించడమే కాకుండా, పనుల నాణ్యతా ప్రమాణాలను, పురోగతిని తనిఖీ చేశారు. తొలుత కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కడా ప్రత్యేక అధికారి వెంకట్రెడ్డితో కలిసి విద్యా, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, పబ్లిక్ హెల్త్, ఆర్‌అండ్బి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల పనులపై చర్చించారు. మంజూరై ఇప్పటికీ ప్రారంభం కాని (గ్రౌండింగ్) అభివృద్ధి పనులను వెంటనే మొదలుపెట్టాలని స్పష్టం చేశారు. అత్యవసరమైన పనులకు ప్రాధాన్యత ఇచ్చి చేపట్టాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీ భవనాలు, బిటి రోడ్లు, బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. దుద్యాల మండల సముదాయ భవన పనులను మే నెలాఖరులోపు పూర్తి చేయాలని గడువు విధించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు.

**క్షేత్రస్థాయి పరిశీలన**

సమీక్ష అనంతరం కలెక్టర్ పలు నిర్మాణ పనులను పరిశీలించారు ఆర్‌అండ్బి గెస్ట్ హౌస్ పనులను పరిశీలించి, నూతన ఫర్నిచర్ సమకూర్చుకోవాలని సూచించారు. పట్టణ కేంద్రంలో అంతర్గత మురుగు కాలువల అభివృద్ధిలో భాగంగా సెప్టిక్ ట్యాంకు కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని ఆదేశించారు. పట్టణంలో నిర్మాణమవుతున్న స్విమ్మింగ్ పూల్, చెరువు సుందరీకరణ పనులతో పాటు డిగ్రీ కళాశాల, దుద్యాల ఎడ్యుకేషన్ హబ్ పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యూఐడిసి ఎస్ఇ విజయ్ భాస్కరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ ప్రభాకరెడ్డి, పంచాయతీరాజ్ డిఇ సురేష్ కుమార్, ఆర్‌అండిబి ఈఈ శ్రీధరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఇ రవిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా రన్ ఫర్ జీసస్

**మొయినాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** మొయినాబాద్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చ్ డిస్ట్రిక్ట్ సూపరింటెండెంట్ విజయరావు ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ రన్ మొయినాబాద్ మెథడిస్ట్ చర్చ్ వద్ద ప్రారంభమై, పటాన్‌చెరు మున్సిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సోనియా దర్శన్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, మెథడిస్ట్ చర్చ్ లే లీడర్ డప్పు రాజు, కౌన్సిలర్లు కర్రోల శ్రీధర్, గీతా వనజాక్షి తదితరులు హాజరై మద్దతు తెలిపారు. వివిధ చర్చిలకు చెందిన సంఘస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యేసుక్రీస్తు సందేశాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా డీఎస్ విజయరావు మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా సమాజంలో శాంతి, ప్రేమ, సేవా భావనలను పెంపొందించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మనిషిని మనిషిగా గౌరవించినప్పుడే శాంతిభద్రతలు పరిరక్షి ంచబడతాయని ఆయన అభిప్రా యపడ్డారు.

## సేవ చేయడం అదృష్టంగా భావించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా మౌలిక సదుపాయాలతో పాటు రెవెన్యూ సమస్యల పెండింగ్‌లు తగ్గించడంలో అంకితభావంతో పనిచేశారని కలెక్టర్ అన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతలను నిజాయితీగా నిర్వహిస్తూ తన పట్ల నమ్మకాన్ని పెంపొందించుకున్నారని కలెక్టర్ అన్నారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి మాట్లాడుతూ, జిల్లాలో శిక్షణ కాలం పూర్తిగా విజయవంతం చేసుకోవడానికి కలెక్టర్లు, జిల్లా అధికారులు తోడ్పాటు అందించారన్నారు. జిల్లాలో శిక్షణ కాలం పూర్తి చేసుకోవడం సంతృప్తిని కలిగించిందని అన్నారు.

శిక్షణా కాలంలో తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు, ఆర్డిఓలు, జిల్లా అధికారులు ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి ని పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ లు వాసు చంద్ర, కె.అనిత, డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, డిటిడబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## స్కూలు ఆవరణలో క్షుద్ర పూజలు?

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ గోడలను కూడా కొందరు ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. పాఠశాల భద్రతపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, రాత్రి పహారా వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మామిడికి అకాల గండం

(మొదటి పేజీ తరువాయి)

బీసీ, ఇతర కులాల వారికి 80 నుండి 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు సరఫరా చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి మామిడి రైతుల పాలిట శాపంగా మారినప్పటికీ, మొండి ధైర్యంతో వారు సాగును కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు సకాలంలో అందితేనే తమకు కొంత ఊరట కలుగుతుందని రైతులు ఆశిస్తున్నారు

## భూ కబ్జాకు రాజకీయ వ్యూహం

(మొదటి పేజీ తరుయి)

అమ్మడం ఇష్టం లేదని వారు తెగేసి చెప్పారు. దీంతో ఎలాగైనా ఆ భూమిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన ఓ కీలక నాయకుడు తన రాజకీయ ప్రభావాన్ని ఉపయోగించి తప్పుడు పత్రాలు సృష్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి విమలమ్మ పేరు మీద ఉన్న డిజిటల్ సంతకాన్ని రికార్డుల నుండి తొలగించి, ఆ భూమిని వేరే వ్యక్తుల పేరిట మార్చేందుకు ప్రయత్నించారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. విషయం తెలుసుకున్న విమలమ్మ కుటుంబ సభ్యులు శనివారం పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అధికారులను నిలదీశారు. తమ భూమిని అక్రమంగా ఇతరుల పేరిట ఎలా మారుస్తారని ఆందోళన చేపట్టారు. రెవెన్యూ రికార్డులు మధ్యవర్తుల చేతుల్లో ఉండటంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, అక్రమంగా పట్టా మార్పిడి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

**గజ్వేల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**

గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచి రెండు సంవత్సరాలు అవుతున్నా కెసిఆర్ ప్రజలకు అందుబాటులోకి రావడంలేదని శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముట్టడించి కార్యాలయంలో ఉన్న కెసిఆర్ చిత్రపటాన్నితొలగించి సిఎం రేవంత్‌రెడ్డిచిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ క్యాంప్ కార్యాలయం నుండి ఇందిరాపార్కు చౌర స్తా వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూం కుంట ఆంక్షరెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ ఇప్పటికే రూ.కోటి 20 లక్షల రూపాయల వేతనం, ఇతర అలవెన్సులు పొందినట్లు ఆరోపించారు. గజ్వేల్ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్న ఆయ నను వెంటనే ఎమ్మెల్యే పదవి నుంచి తొలగిం చాలని డిమాండ్‌చేశారు. గజ్వేల్ ప్రజలకు అందు బాటులో ఉండని కెసిఆర్ ఒక్కక్షణం కూడా ఎమ్మెల్యేగా కొనసాగే నైతికహక్కు లేదని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్‌గుప్తా, మండలపార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, కనకయ్యగౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, వెంకటేష్, జిల్లా మైనార్టీసెల్ నేత సమీర్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ ప్రధాన కార్య దర్శి నక్క రాములుగౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయిని సత్యలక్ష్మి యాదగిరి, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, అజ్జర్ తదితరులు పాల్గొన్నారు.



## డిసిసి ప్రధాన కార్యదర్శిగా సిరాజుద్దీన్

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** మోమిన్‌పేటకు చెందిన వారాల సిరాజుద్దీన్‌ను జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనను డిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా అద్యక్షులు ధారాసింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సిరాజుద్దీన్ తెలిపారు.



## విష్ణువర్ధన్‌రెడ్డికి పిహెచ్‌డీ ప్రదానం

### లంగ్ క్యాన్సర్‌పై జరిపిన పరిశోధన

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి విష్ణువర్దన్‌రెడ్డి ప్రతిష్టాత్మకమైన డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పిహెచ్‌డీ పట్టా సర్టిఫికేట్టును శనివారం అందజేశారు. లంగ్ క్యాన్సర్‌పై జరిపిన పరిశోధనలో యూనివర్శిటీ ఉపకులపతి, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ జి. విష్ణుమూర్తి, డీన్ సీఎస్సీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి, అధ్యాపకులు తదితరులు విష్ణువర్దన్‌రెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు, ఆవిష్కరణలు వృత్తిపరమైన విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.


పట్టా ప్రదానం చేస్తున్న కళాశాల డీన్ జి.విష్ణుమూర్తి తదితరులు

## రైతు సంఘం సభ్యత్వాలకు విశేష స్పందన

**ఆమనగల్లు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** అన్నదాత సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి విమర్శించారు. శనివారం మండల పరిధిలోని పెద్దతండా, చిన్నతండా, రాంనుంతల, కోనాపూర్, ఆకుతోటపల్లి, చెన్నంపల్లి, పోలెపల్లి, సింగంపల్లి, జంగారెడ్డిపల్లి గ్రామాల్లో సంఘం సభ్యులు పర్యటించి రైతు సంఘం సభ్యత్వ నమోదును నిర్వహించారు. రైతుల నుండి విశేష స్పందన లభించింది. దాదాపు 300 మంది సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలలో పాలకవర్గాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకం అమలకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు ఫించన్ పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభులింగం, రాంచందర్, విజయ్, నరేందర్, వేణుచారి, రంగయ్య, చంద్రయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు

**యాచారం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని కొత్తపల్లి సర్పంచ్ చిక్కుడు వెన్నెల శేఖర్ తెలిపారు. గ్రామంలోని నాలుగో వార్డులో రూ.2 లక్షలు ఖర్చుచేసి పైప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజాపా లన–ప్రణాళికలో భాగంగా గ్రామంలోని మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టామని వివరించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాలన్నీ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కోరిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాలు అనిత రమేష్, వార్డు సభ్యులు సత్య నారాయణ శివ కంబాలపల్లి కుమార్, మహేశ్వరం వినోద్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, కరోబార్ పరమేశ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్


ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

## అభివృద్ధి పనులలో సమస్యలు వస్తే చెప్పండి

**దుద్యాల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హకీంపేట్ లో ఏర్పాటు చేయనున్న ఎడ్యుకేషన్ హబ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్ భవనాల నిర్మాణ పనులలో వేగం పెంచాలని, అభివృద్ధి పనులలో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఈడబ్ల్యూఐడిసి ఎస్ఈ విజయ భాస్కర్ రెడ్డి, తహసిల్దార్ కిషన్ నాయక్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్రవంతి

## నందిగామలో వైద్య శిబిరం విజయవంతం

**నందిగామ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా టిబి ముక్తిభారత్ అభియాన్ (2) వైద్య శిబిరాన్ని డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రం నుండి రిస్క్ టీం, టీబీ యూనిట్, వైద్య సిబ్బంది,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ ప్యూర్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన విద్యార్థులు

## పాఠశాలలో మంచినీటి ప్లాంట్ ప్రారంభం

**నందిగామ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** నందిగామ మండలం చేగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెమోక్రటిక్స్‌సగ్‌కు చెందిన 22 మంది విద్యార్థులు తమ సొంత నిధులతో కమ్యూనిటీ ప్యూర్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ రాజ రెడ్డి, సర్పంచ్ మంకాల శ్రీశైలం, కమ్యూనిటీ ప్యూర్ వాటర్ ప్రతినిధులు ప్రతిక్ష ప్రశాంత్, పురుషోత్తం రావు, కె.శ్రీనివాస్ రావు, వార్డు సభ్యుడు సురేష్, భీమయ్య, ప్రవీణ్, రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

